# స్నేహితుడి భార్య

[గల్పిక]

"నేనుసినిమాకు పోతున్నాను" అన్నాడు మొగుడు.

'ఈ సినిమా ఏమిటో నాకు తెలుసు!' అనుకున్నది భార్య. "నేను కూడా రానా?" అన్నది.

"ఆఁ! మంచి సినిమా కాదు, నిద్రపట్టక పోతున్నాగాని."

'ఈ నిద్ర పట్టకపోవటమూ నాకు తెలుసు!' అనుకున్నది భార్య.

ఇవ్వాళ ఎనిమిదిన్నర పాసెంజరుకు ప్రసాదరావు బెజవాడ వెళ్ళాడు. ఇంటిదగ్గిర నీలవేణి ఒంటరిగా ఉంటుంది. అయ్యగారు తొమ్మిదింటికే సినిమావంక పెట్టి వేంచేస్తున్నారు! ఎట్లా చేస్తారో మగవాళ్ళింత దుర్మార్గం? తన స్నేహితుడి భార్యకదా?

వాళ్ళిద్దరికీ—తన భర్తకూ, నీలవేణికీ,—ఏదో సంబంధం ఉండవచ్చునని ఇవాళ ఇదయమే తనకు అనుమానం పోవడమూ, ఆ అనుమానం కాస్తా ఇప్పుడే ఋజువు కావడమూనూ!

నిజానికి తన భర్తకంటే ప్రసాదరావు ఎన్నోరెట్లు అందగాడు, అతనిమీద తనకు ఎన్నిసార్లు బుద్ధిపోలేదు! తను తూలిందా?

నీలవేణి-పేరు నాజూకేగాని--తనకంటే ఏవిధంగా అందకత్తె? తలుచుకున్నకొద్దీ మండిపోతున్నది!...ఈ పాటికి తన భర్త ప్రసాదరావుగారింటికి సగందూరంలో ఉంటాడు....

ఆమె చివాలున లేచింది. దీపం తగ్గించి, తలుపులన్నీ దగ్గరగా వేసి బయటికొచ్చింది. బయటి తలుపు గొళ్లెం పెట్టి ప్రసాద రావుగారింటి కేసి బయలుదేరింది.

ఆటే దూరం లేదు. అదే ప్రసాదరావుగారిల్లు. తనభర్త జాడ ఎక్కడా లేదు. రోడ్డు లాంతర్లున్న చోట తప్ప అంతా చీకటి. అంతా నిశ్శబ్దం. చలికాలం కావటంమూలాన రోడ్డు మీద ఒక్క పురుగు లేదు, తొమ్మిదింటికే.

ఎదురుగా ఎవరో వస్తున్నారు, ఆమె గుండె గుబుక్కుమన్నది. అమ్మో! ప్రసాదరావు! రైలుకు పోనే లేదు. ఇంటికి తిరిగి వస్తున్నాడు! పెళ్ళాం రహస్యం తెలిసిందో ఏమో!

అతన్ని లోపలికి వెళ్ళనివ్వరాదు. కొంప పోతుంది.

ఆమె నాలు గడుగులు ముందుకు నడిచి ప్రసాదరావును సమీపించింది.

ప్రసాదరావు నిర్ఘాంతపోయినాడు.

''ఏమమ్మా? ఎవరికోసం? ఎక్కడికి?'' అన్నాడు అతను.

తను నవ్వింది. ఇంకా నయం, నవ్వగలిగింది.

''మీకోసమే!'' అంది తరువాత అతనేమనుకున్నా సరే!

''నాకోసమా? నా ప్రయాణం ఆగిపోయిం దని ఎట్లా తెలిసిందీ?''

''మీరు కూడా ప్రయాణమైనారని నాకు తెలీదు.''

''పోనివ్వండి. నాతో ఇప్పుడేం పని?''

''మీతో ఒక అరగంటసేపు రహస్యంగా మాట్లాడాలి.''

అతను నమ్మటంలేదు. ''మా గొడ్లపాకాలో కూర్చుందామా?''

తను సరే నన్నది.

అతను ఒక నులకమంచంవాల్చి "కూచోండి!" అన్నాడు.

తను కూచుని అతని చెయ్యిపట్టుకుని బలవంతాన కూచోపెట్టింది. అతనికి అర్థమయింది.

"ఈ ఆలోచన ఎంతకాలం నుంచీ?" అన్నా డతను దగ్గిరికిజరిగి.

"మనం చాలా తప్పు చెయ్యబోతున్నాం. నాకు నీమీద ఎంతకాలంనించో ఉంది. స్నేహితుడి భార్యవని చంపుకున్నాను.........అదీకాక మాఆవిడంటే నాకు చాలా గౌరవం."

"మీ ఆవిడ! అయ్యో రాత!!" అనుకుంది తను.

"ఈ వెధవ గొడ్లపాకా ఏమిటి? మనం మీ యింటికి పోదాం?" అన్నాడతను.

"మాయింటికా? వద్దు!"

"ఏం మీఆయన ఇంట్లో లేడుగా!"

ఆమె చివాలున లేచింది. ఇతనికంతా తెలుసు. తను నిష్కారణంగా శీలం చెడగొట్టుకున్నది.

"ఎట్లా తెలుసు!" అన్నది వణుకుతున్న గొంతుతో.

"వాడు సినిమాకు వెళుతూ దారిలో నాక్కనిపించాడే!"

తను ఇక అక్కడ ఒక్కక్షణం ఉండలేదు. పరిగెత్తింది. వెనకనించి దయ్యాలూ, భూతాలూ తరుముకొస్తున్నట్లు పరిగెత్తి కడప్రాణంతో వచ్చి కొంపలోపడి తలుపు బిడాయించుకున్నది.